

# సత్యవాదం

ఆంథోని, అస్రానీ, అవధానీ- ముగ్గురూ మూడు మతాల దేవాలయాలకి పూజారులు. ఒకరోజున ఆ ముగ్గురూ ఊరి చివర పాడుబడిన బౌద్ధారామంలో జూదం ఆడుతూ పట్టుబడ్డారు. ఆరోజే విచారణ.

సిక్కు మతస్థుడైన న్యాయాధికారి చిక్కులో పడ్డాడు. వీళ్ళని శిక్షిస్తే రెండు ప్రమాదాలు. ఒకటి మతకలహాలకి దారితీయవచ్చు. రెండు ప్రజలకి మతం మీద నమ్మకం పోవచ్చు. అందుకని ఆయన ఏం చేయాలా అని ఆలోచిస్తూ

"మీ పేరేమిటి?"

"ఆంథోని"

"మీరేం చేస్తుంటారు"

"ఫలానా చర్చిలో అర్చకుడిని"

"మీరు న్యాయస్థానానికి వచ్చిన కారణం?"

"జూదం ఆడాననే నేరం మీద"

"మీరు దేవుడి మనుషులు. మీరు జూదం ఆడారంటే నాకాశ్చర్యంగా ఉంది. కాని రక్షకభటులు మీరు జూదం ఆడారంటున్నారు. ఇందులో ఏదో పొరపాటు జరిగి ఉంటుందని నా అనుమానం. మీమాట నేను నమ్ముతాను. మీరు నిజంగా జూదం ఆడారా?"

ఆంథోనీ ఒక్కక్షణం కళ్ళు మూసుకున్నాడు 'భగవంతుడా! క్షమించు' జీవితంలో యింకెప్పుడూ జూదం ఆడను. ఈసారికి చిన్న అసత్యం ఆడక తప్పడం లేదు. అది

కూడా నాకోసం కాదు. అమాయకులైన ప్రజలకు మతం మీద నమ్మకం పోకుండా ఉండటం కోసమే,

కళ్ళు తెరిచాడు. గంభీరంగా చిరునవ్వు నవ్వాడు. "ఆడలేదు" అన్నాడు. న్యాయాధికారి సంతోషించాడు. 'మీరిక వెళ్ళవచ్చు. మీరు నిర్దోషులు"........

"మీ పేరేమిటి?"

"అస్రానీ"

"మీరేం చేస్తుంటారు"

"ఫలానా మసీదులో రసూల్‌ని"

"మీరు న్యాయస్థానానికి వచ్చిన కారణం?"



"మీరు దేవుడి మనుషులు. మీరు జూదం ఆడారంటే నాకాశ్చర్యంగా ఉంది. కాని రక్షకభటులు మీరు జూదం ఆడారంటున్నారు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగి ఉంటుందని నా అనుమానం. మీరు అసత్యం చెప్పరని నా నమ్మకం. మీరు నిజంగా జూదం ఆడారా లేదా చెప్పండి?"

ఆస్రానీ ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు. "భగవాన్ ! క్షమించు ఏనాడూ ఇక జూదం ఆడను. ఈసారికి చిన్న అసత్యం ఆడుతున్నాను. అది కూడా ప్రజలకు మతం మీద నమ్మకం పోకుండా ఉండటం కోసమే".

గంభీరంగా చిరునవ్వు నవ్వుతూ కళ్ళు తెరిచాడు. "ఆడలేదు" అన్నాడు. న్యాయాధికారి సంతోషించాడు. "మీరిక వెళ్ళవచ్చు. మీరు నిర్దోషులు".......!

"మీ పేరేమిటి?"

"అవధాని అంటారండి" "మీరేం చేస్తుంటారు"

"ఫలానా ఆలయంలో అయ్యవారినండి"

"మీ రయ్యవారయుండి, జూదం ఆడారంటే నమ్మలేకుండా ఉన్నాను. కాని రక్షకభటులు మీరు జూదం ఆడారంటున్నారు. ఇందులో ఎక్కడో ఏదో పొరపాటు జరిగిందని నా అనుమానం. మీ మాట నాకు నమ్మకమే. జూదం ఆడారా లేదా చెప్పండి?"

అవధాని ఒక్కక్షణం కళ్ళు పెద్దవి చేసి , ఆశ్చర్యంగా చూస్తూ, "జూదమా? ఎవరితో ఆడతానండి? ఎవరితో ఆడానో వాళ్ళూ ఉండాలి కదా యిక్కడ? ఎవ్వరూ లేకుండా నేనొక్కడినే జూదం ఆడాననడం ఏం ధర్మం? ఎవరితో ఆడానో చూపించమనండి ఒప్పుకుంటాను" అన్నాడు.

న్యాయాధికారి చెవిదగ్గరి చేమంతిపువ్వు చెమక్కుమంది. ఆయన గంభీరంగా కళ్ళు మూసుకుని "మీరిక వెళ్ళవచ్చు. మీరు నిర్దోషులే" అని అనక తప్పలేదు.